## కథానిక



# జైలు నుంచి దేశసేవకుడి శవం బయటికెళ్లింది

— సోమంచి యజ్ఞన్న శాస్త్రి

సీ క్లాసు రాజకీయ ఖైదీలున్న ఆ జైలులో ఆరకుండా మిగిలిన ఒక్క దీపమూ మిణుకు మిణుకు మంటూంది. ఇది కూడా ఆరిందంటే జైలంతా అంధ కారమే.

"దాహం... మంచినీళ్ళు" అన్నాడు వగరుస్తూ గోపాల స్వామి. జ్వరంతో అతని వొళ్ళు పేలిపోతోంది. మాట వినిపించుకోనట్టు అందరూ వూరుకున్నారు.

"దాహం..." అని గట్టిగా అరిచాడు గోపాలస్వామి. "ఏమండీ ఇమ్మంటారా మళ్లీ నీళ్లు" అని సందే హంతో అడిగాడు శేఖర్, తన పక్కన కూర్చున రంగనాధంగారి నుద్దేశించి.

"జ్వరంమీద తాగకూడదు బాబూ. ఇప్పటికప్పుడే పది గ్లాసుల నీళ్ళు తాగావు. ఇంకా తాగితే ప్రమాది స్తుంది" అని రోగికి హితవు చెప్పారు రంగనాధంగా రు.

"నోరెండి చచ్చిపోతున్నానండీ. నే బతకలేను" అన్నాడు మూలుగుతూ గోపాలస్వామి.

"ఛీ, ఛీ! అలాటి మాటలనకు... చూడు, నీళ్లు లోపలికి తాగకుండా, కొస్త నాలిక తడి చేసుకుంటూ ఉండు. ఎలాగో ఈ రాత్రి గడిస్తే, రే ప్రొద్దున్నే నిన్ను ఆసుపత్రిలో జేర్పిస్తాము" అన్నారు రంగనాధంగారు.

"అక్కడ మాత్రం మందు లేడిశాయీ... డిస్టిల్డు వాటరన్నా లేదు, మన వెధవ జైలు ఆసుపత్రిలో" అని గొణిగాడు చంద్రం.

గోపాలస్వామి పెద్దగా మూలగడం ప్రారంభించాడు. వగర్పు కూడా ఎక్కువయింది. మిగతా ఖైదీలంతా లేచి కూచున్నారు. ఆ నిశీధ సమయంలో చేసేదేదీ పాలుపోకుండా ఉంది.

"మనకి డాక్టరు వామనరావేగా? ఓ దాని కో మందిచ్చి అసలే చంపుతాడు!"

అప్రయత్నంగా అందరూ నవ్వారు.

'వామనరావు' ఆ డాక్టరుగారి అసలు పేరుగాదు. పొట్టిగా ఉండడం వల్ల ఖైదీలే ఆయనకి నామకరణం చేశారు. ఆయన అసలు పేరు ఎవరికీ గుర్తే లేదు. ఆయన కూడా పరధ్యానంలో 'వామనరావుగారూ' అంటే 'ఓ' అని పలుకుతూ ఉంటాడు. 'వామనరావు' జైల్లో చిన్న డాక్టరు. ఆయనకి ఎప్పుడూ ఒకటే తొందర. అర నిమిషం కూడా ఎక్కడా కాలు నిలిచేది కాదు. ఆ తొందర్లో ఒక దానికొకటి చేసేవాడు సాధార ణంగా. ఆయనిచ్చిన మందు పుచ్చుకోడమంటే భయంగా ఉండేది అందరికీ. కాని పెద్ద డాక్టరు అనలే కర్కోటకు డవడం వల్ల, భయపడుతూ నయినా, వామనరావు దగ్గిరకే చేరడం తప్పేది కాదు.

గోపాలస్వామి చేతులూ కాళ్లూ తన్నుకోవడం ప్రారంభించాడు. మూలుగు ఎక్కువయింది. డాక్టరు కోసం వార్డర్ని పరిగెత్తించక తప్పింది కాదు.

* * *

"పాపం, మహాబాధపడుతున్నాడు. ఏం జబ్బో గాని!"

గోపాలస్వామి క్రితం రోజునే జైల్లో ప్రవేశించాడు. ఉదయం పది గంటలకు 'అడ్మిషన్' కి వొచ్చేసరికి అతనికి జ్వరంగా ఉంది. తిన్నగా నిల్చోడానికి శక్తి లేక ఓ మూల కూలబడ్డాడు. ప్రవేశ పెట్టుకోడానికి జైలు అధికార్లొచ్చేసరికి మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. ఆహారం లేకా, జ్వరం వల్లా కళ్ళు తిరగడం ప్రారంభించాయి... తను వొచ్చినా లేచి నుంచోని ఖైదీని చూసి మండిపోయాడు జైలరు. 'లేచి నించో లేకుండా ఉన్నా'నన్నాడు గోపాలస్వామి. 'వెధవ్వేషా లన్నీని. జైలుకి రాగానే టక్కులు. ఈ జ్వరం వయినే మయింది, నించో' అని ఒక్క అరుపరిచాడు జైలరు.

అతి కష్టం మీద గోపాలస్వామి లేచి నిలుచున్నాడు.

ఓ గంట సేపటికి గాని అతన్ని 'ప్రవేశ పెట్టుకోడం'* పూర్తి కాలేదు. తన 'జాగా' చూసుకుని నడుం వాల్చేసరికి మరో గంట పట్టింది. రోజంతా కడుపులో ఏమీ పడలేదు. నకనకలాడి పోతోంది. సాయంకాలం అందరితో పాటు తనూ ఓ ముద్ద పులుసు అన్నం తినేశాడు ఆకలి బాధ పడలేక.

రాత్రి జ్వర మెక్కువయి పోయింది. రాత్రంతా బాధతో మూలుగుతూనే ఉన్నాడు. పొద్దున్న పది గంటలు దాటిన తరవాత వొచ్చాడు పెద్ద డాక్టరు, ఓ మాటు ఖైదీల నందరినీ చూసి పోవడానికి. ఎక్కడ ఆగితే ఎవరి ఫిర్యాదు వినవలసి వస్తుందో అన్నట్టుగా, ఎక్కడా కాలు నిలవక, మెయిలు ట్రెయినులా, ఆ బ్లాకంతా ఒక్కమాటు కలియ జుట్టేసి, తన ధర్మం నిర్వర్తించు కున్నట్టు బయటికి దాటెయ్యాలని చూసే వాడు ఆయన ప్రతిరోజూ. ప్రాణాలు విసిగిపోయి ఆయనతో జబ్బుల సంగతి చెప్పుకోడం మానుకున్నారు ఖైదీలు. ఆయన పలకరించినా పలక్కూడదని కూడా ఒకప్పుడు ఆ జైల్లో నియమం ఏర్పడింది.

ఆ రోజున డాక్టరు బ్లాకులో కాలెట్టగానే రంగనాధం గారు ఆయన్ని ఆపి, గోపాలస్వామి సంగతి చెప్పారు. రంగనాధం గారు ఆ బ్లాకులో అజాతశత్రువు. ఎన్నడూ పరుష మైన మాట ఆయన నోటంట వొచ్చేది కాదు. నిజమైన సత్యాగ్రహి ఎవరైనా ఉన్నారా అంటే ఆయనే అనిపించేది అందరికీ.

"జైల్లోకొచ్చేసరికి, తేరగా ఉంటుందని, అందరికీ జబ్బులొస్తాయండీ" అన్నాడు పెద్ద డాక్టరు రంగనాధం గారితో. రంగనాధం గారు తెల్లబోయారు. ఇదివరకు చాలామంది ఈ డాక్టరుగారితో ఘర్షణ పడ్డసంగతి ఆయనకి తెలుసు. కానీ ఆయనంటే చివరికి జైలు సూపరింటెండుకి కూడా గౌరవ ముంది. ఆయన ఎప్పుడూ ఎవరితోనూ అనవసరంగా మాట పెంచరు. డాక్టరు ఈ విధంగా తృణీకరించే సరికి ఆయన తెల్లబోయి, రాబోతున్న కోపం అణచుకుని "మీరు వొచ్చి చూసి నిజంగా జబ్బుందో లేదో కనిపెట్టి మందు ఇవ్వండి" అని అతి వినయంగా జవాబిచ్చారు.

"ఒకవేళ కాస్త జ్వరమున్నా మరేం భయం లేదు. లంఖనం పరమౌషధం! మందూ గిందూ ఏమీ అక్కర్లేదు" అన్నాడు డాక్టరు.

"ఇది మామూలు జ్వరం కాదండి. పాపం, ప్రాణి చాలా బాధపడుతున్నాడు."

"జైల్లోకొస్తే అందరికీ పట్టుకునేది ఒకటే జబ్బండి, అజీర్తి, కడుపునొప్పి! పొట్ట ఎక్కొచ్చేలా తినేస్తారు! దాంతో అజీర్తి జ్వరాలూ, రక్త విరేచనాలూ పట్టుకుంటాయి" అని మళ్ళీ వెటకారంగా మాట్లాడారు డాక్టరు. "క్షమించాలి. తిండి లేనివారం కాము మేమెవరమూ, పెట్టే పులుసు ముద్దా-పంచభక్ష పరమాన్నాలనుకొని గొంతు దాకా నింపేటందుకు. అయినా అనవసరమయిన గొడవలన్నీ ఎందుకు? మీరు రోగిని చూసి ఏదయినా మందిప్పించండి" అని దారం తుంచేశారు రంగనాధంగారు.

"నే చూడనక్కర్లేదు. ఆసుపత్రిలో చెప్పి, అజీర్తికి కాస్త మందు తెచ్చి గొంతుకలో పోయండి. ఓ రోజు తిండి మానమనండి. అదే నయమవుతుంది" అన్నాడు పెద్దడాక్టరు గారు.

"మీరు అంత తృణీకారంగా జవాబివ్వడం భావ్యం కాదు" అన్నారు రంగనాధంగారు.

"ఉన్న మాటలంటే ఉలుకెక్కువ" అని సామెత చదివాడు డాక్టరు.

"తమరు ఒక్క మాటు రోగిని చూసి మందు యిచ్చి వెళ్ళాలి" అన్నారు రంగనాధంగారు మాట వినిపించుకోకుండా. "అతనికి చాలా బాధగా ఉంది."

"ఎందుకండీ యింత గాభరా పడిపోతారు. బాధ పడితే యేం? ఏం బాధ లేకుండా పెళ్ళి కొడుకుల్లా జైలు కొచ్చి నాలుగు రోజులు కూచుని నాయకులమైపోదా మనుకున్నారూ! మహా దేశసేవ చేస్తున్నామంటున్నారుగా జైలుకొచ్చి! జైలు బాధలన్నీ అనుభవించండి!! ఆ మాట కొస్తే ఇక్కడ ఎంతబాధ పడితే మీకంత మంచిది. అంత ఎక్కువసేవ చేసినట్టు. అసలు మందులెందుకండీ! ఇక్కడ చచ్చిపోతే మరీ గొప్ప త్యాగం చేసినట్టు. మీరు ఎంత మంది చచ్చిపోతే అంత గొప్ప చెప్పుకోవచ్చు!" అన్నాడు చిరునవ్వు పెదవులమీద తాండవింపచేస్తూ.

"తన్నండేయ్ గాడిదకొడుకుని. యింకా చూస్తారేం" ఖైదీలందరూ డాక్టర్ని చుట్టుముట్టేశారు. రంగనాధం గారు అడ్డు తగలకబోతే ఆనాడు డాక్టరుగారి రక్తం కళ్ళజూసే వారే.

"ఎందుకుబాబూ మమ్మల్ని అనవసరంగా అవమానం చెయ్యాలని ప్రయత్నం. నువ్వూ ఓ భారతీయుడివి. నీకూ పెళ్ళాం బిడ్డలున్నారు. రోగులకి సేవచేస్తానని ప్రమాణాలు తీసుకున్నావు డాక్టరువైనప్పుడు. దేశసేవ చెయ్యకపోతే మానిరి; నీ ధర్మమైనా తిన్నగా నిర్వర్తించుకో" అన్నాడు రంగనాధం గారు.

ఇంతమంది ఖైదీలు ఒక్కమారుగా మీదికి రావడం చూసి డాక్టరు గాభరా పడిపోయాడు. ఇదివరకు ఎన్నో మాట్లు ఆయన ఖైదీల్ని అవమానం చేశాడు గాని వాళ్ళీ విధంగా ఎదురు తిరగడం ఆయనికి అనుభవం లేదు. కనక, వెనక్కి తగ్గి చరచరా గోపాలస్వామి దగ్గిరికి నడిచాడు.

రోగికి నూటనాలుగు డిగ్రీల జ్వరం పేలిపోతోంది. అరనిమిషం పరీక్షచేసి, కాగితం ముక్కమీద ఏదో గీసి, డాక్టరుగారు మరి మాట్లాడకుండా వెళ్ళిపోయారు, "అయ్యా! వారికి పాలు ఇప్పిస్తారు కదూ!" అని రంగనాధంగారు అంటున్న మాటన్నా వినిపించుకోకుండా.

ఆ రోజున ఏదో ఓ మోతాదు మందు పడింది. కాని పాలు రాలేదు. జ్వరం తగ్గుముఖం పట్టిన మరో రోగిని బతిమాలి, అతనిపాలు కొంచెం తీసుకొచ్చి పోశారు సాయంత్రం.

రాత్రికి జ్వరం మరీ హెచ్చిపోయింది. దాంతో కొత్త లక్షణం. దాహంకూడా పట్టుకుంది.

* * *

"నోరెండుకుపోతోందండేయ్, నీళ్ళు" అని గుడ్లు తేలేస్తూ గోపాలస్వామి మళ్ళీ అరిచాడు. ఉన్న ఒక్క దీపమూ ఒక్కమాటు టపటప కొట్టుకుని ఆరిపోయింది. చీకటి గాఢాంధకారం! జైలు రూల్సు ప్రకారం తెల్లవార్లూ బ్లాకులో రెండు దీపాలు వెలగాలి. దానికి సరిపోయిన కిరసనాయిలు మంజూరు చేశామని జైలరుగా రంటారు, కాని సూపరిండెంటు మొదలు వార్డర్లదాకా జైలు ఆఫీసర్లంతా తమ తమ భాగాలు భుక్తం చేసుకున్నాక మిగిలిన కిరసనాయిలుతో, ఒక్కదీపం, రాత్రి రెండుగంటల దాకా నన్నా వెలగదు.

గోపాలస్వామికి ఎగశ్వాస ప్రారంభమైంది. డాక్టరు ఇంకా రాలేదు. భగవంతుడి మీద భారం వేసి వేచి ఉండడం తప్ప మరేమీ గత్యంతరం కనిపించలేదు. కొన్ని యుగాలయిన తరువాత దొర్లుకుంటూ, అతి గాభరాగా వచ్చి పడ్డాడు వామనరావు డాక్టరు గారు. ఆయనతో ఓ దీపమూ వొచ్చింది. "ఏమిటీ గొడవంతా. రాత్రి నన్ను నిద్రరోనివ్వరుటండీ" అని దీర్ఘాలు తీశాడు వామనరావు. వామనరావు దీర్ఘాలకి అందరూ నవ్వుకోడం మామూలు. ఆ రోజున అందరి గుడ్లూ ఎఱ్ఱబడ్డాయి. "తిన్నని మందు యివ్వకపొండి, రేపు మీ సంగతి తెలుస్తుంది" అన్నారు ఒకరు. వామనరావుది అసలే పిరికిగుండె. అది కాస్తా జారింది.

గోపాలస్వామి దగ్గరికి పరుగెత్తికెళ్ళి, రోగికంటే తనే ఎక్కువగా వగరుస్తూ, పరీక్ష ప్రారంభించాడు. అతనికి నాడి ఎక్కడా అందలేదు. వామనరావుకి నిజంగా గాభరా వేసింది. ఏదో మామూలు జబ్బు అనుకున్నాడు కాని ఇంత ప్రాణం మీదకొచ్చిందనుకోలేదు. వెళ్ళి ఓ ఇంజక్షన్ తీసుకొన్ని యిచ్చాడు, అరగంట అయిన తరువాత మరో ఇంజక్షన్ యిచ్చాడు, బాధ తగ్గలేదు. మరో ఇరవై నిమిషాల్లో గోపాలస్వామి కళ్ళు మూశాడు.

* * *

"ఈ డాక్టర్లని ఇవాళ ఇక్కడ పాతిపెట్టాలండీ' అన్నాడు శేఖర్. "ఇంకా ఎంతమందికి ఈ రాతవుందో జైలు విడిచే లోపల. వీళ్ళకి బుద్ధి చెప్పాలి."

రంగనాధంగారి కంఠం రుద్ధమయింది. "గడియొచ్చినప్పుడు డాక్టర్లేం చెయ్యగలరు బాబూ! ఆయుష్షుంటే మన ప్రాణం తియ్యగలం డాక్టర్ల వశమా?"

"అలా వేదాంతం మాట్లాడితే ఎలాగ! మనం చూస్తూ ఉంటే, మన కళ్ళ యెదుట తిన్నని వైద్య సహాయం లేక చచ్చిపోయాడు గదా, దీనికి గూడా

## ఈ కథ ఎందుకు?

రంగస్థల 'తెర మెరుగులు' దిద్దటానికే కాకుండా, కథలకు 'కొసమెరుపులను' కూడా యిచ్చే తొలినాటి రచయితగా సోమంచి యజ్ఞన్న శాస్త్రిగారు తెలుగువారికి చిరపరిచితులు. చిన్న కథకుండవలసిన లక్షణాలు వారికి బాగా తెలుసు. ...' జైలునుంచి దేశసేవకుడి శవం బయటకెళ్ళింది' కథకు ధ్యేయం స్వాతంత్ర్యోద్యమంలో రాజకీయ ఖైదీల దయనీయ స్థితిని చూపటం, సంక్షిప్తతే కథానికకు బలం కనుక, అతిక్లుప్తంగా ఏ విషయాన్నీ సాగదీయకుండా శాస్త్రిగారు రాసారు. గాంధీగారిలాటి రంగనాధం మానవత్వం మచ్చుకేనా లేని పెద్ద డాక్టరు. అభ్యుదయవాది రామచంద్రన్, శవాన్ని కూడా ఎలా ఉపయోగించుకోవాలో తెలిసిన చాకులాటి చంద్రం పాత్రలు చక్కగా చిత్రించబడ్డాయి. భారత జాతీయ జీవితం సర్వరంగాల్లోనూ కలుషితమైన ఈ రోజుల్లో, యువతరం, స్వరాజ్యం కోసం త్యాగమూర్తులు పడ్డపాట్లు యిలాంటి కథల్లో చదివి తెలుసుకోవటం అవసరం కాదంటారా?

భగవంతుడి మీద భారం వేస్తే ఎలాగ?''

''మన చేతగానితనమూ, క్రూరత్వమూ, వాడి మీద తొయ్యడానికి కాకపోతే ఎందుకనుకున్నారేమిటి భగవంతుడు'' అన్నాడు రామచంద్రన్. రామచంద్రన్ లెఫ్టిస్టు. జైల్లోకొచ్చి భగవద్గీత పారాయణ మొదలెట్టినవాళ్లని చూస్తే అతనికి వొళ్ళు మంట. వీలైనప్పుడల్లా భగవంతుడి మీద దాడి చేశేవాడు!

''ఏమండీ, శవాన్ని వూళ్ళోకి పంపించనిస్తారా. దహనానికి, ఇక్కడే కానిమ్మంటారా?'' అన్నారు చంద్రం.

''ఎక్కడ దహనం చేస్తే ఏమిటి? ఊళ్ళో ఊరేగింపూ అది చెయ్యనిస్తారు కనకనా? ఇక్కడే అయితే, తోటి ఖైదీల మందరమూ అన్నా వెళ్ళి మర్యాదలన్నీ చెయ్యొచ్చు కాదండీ రంగనాథంగారూ.''

రంగనాథంగారు ఒక్కక్షణం జవాబివ్వలేదు.

''ఎవరో పాపం! అతని పుట్టు పూర్వోత్తరాలేమిటో మనకిప్పటిదాకా ఏమీ తెలియదు. ఈ మారు స్వాతంత్ర్య సమరంలో ఎక్కడెక్కడివాళ్ళో జొరబడ్డారు. ఇతను నిజంగా మనకి ప్రచ్ఛన్న యోధుడు. (Unknown Soldier) ఊరిలోకి పంపించి ప్రయోజనమేమిటి?'' అన్నారు చివరికి.

''ఊళ్ళోకి పంపిస్తేనే బాగుంటుందండీ'' అన్నాడు చంద్ర నసుగుతూ.

''ఎందుకూ, అక్కడ జరవగల అధిక మర్యాదలేమిటి!''

''మర్యాదల కోసం కాదండి...మరి...'' చంద్రం లేచి మెల్లిగా రంగనాథంగారి చెవికింద చేరి గున గున మొదలెట్టాడు. రంగనాథంగారు ''ఛీ ఛీ'' అనారు.

''ఏమిటోయ్. మమ్మల్ని కూడా వినవియ్యి'' అన్నాడు శేఖర్.

''శవాన్ని దహనంకోసం బయటికి పంపిస్తే దానితో పాటు చాలా ఉత్తరాలు కూడా పైకి పంపించవచ్చు నంటాడు చంద్రం'' అన్నారు రంగనాథంగారు.

అందరూ తెల్లబోయారు. ఒక్క నిమిషం ఎవరూ మాట్లాడలేక పోయారు.

''పట్టుబడితే'' అన్నాడు చివరికి శేఖర్.

''పట్టుబడవండీ! శవాన్ని స్నానం చేయించి కొత్త బట్ట కడతాంకదూ ఎలాగునూ. అప్పుడు శవంమీద ఉత్తరాలు పెట్టి బట్ట చుట్టబెడితే సరి. శవం బట్టవిప్పి చూస్తాననడుగా సూపరింటెంటు'' అన్నాడు మెల్లిగా, కొంచెం సిగ్గుపడుతూ, చంద్రం.

''నీకీ ఆలోచన ఎలా పుట్టిందోయ్ అసలు'' అన్నారు రంగనాథంగారు.

ఈ మాటు జైలు అధికారులు కక్షకొద్దీ, ఖైదీల్ని పూర్తిగా ఏడిపించి బాధ పెట్టాలని, ఉత్తరాలేమీ రానీ బయటికి పంపకూడదని నిషేధించారు. లంచం పుచ్చుకుని ఉత్తరాలు బయటికి తీసుకెళదామని ప్రయత్నించిన యిద్దరు ముగ్గురు వార్డర్లు పట్టుబడి డిస్మిస్ అయిపోవడం వల్ల ఆ మార్గం కూడా బందయిపోయింది. నాలుగునెల్లు దాటిపోయింది జైలునుంచి ఇళ్ళకి ఉత్తరాలు వెళ్ళి. ఉత్తరాలు వ్రాసి పంపించడం కోసం అందరూ తహతహ లాడుతున్నారు.

''నిజంగా పట్టుబడకుండా వెళతాయంటావా? పట్టుబడితే సిగ్గుచేటు'' అన్నాడు శేఖర్.

విత్తనం నాటుకుంది.

''ఆ భయమేమీ ఉండదనే నా నమ్మకం.''

''చాలా బాగుందయ్యా నీ ఆలోచన. భగవద్గీత చదివి ఇంత ఉపయోగకరమైన ఆలోచన చెబుతావనుకోలేదయ్యా'' అన్నాడు రామచంద్రన్.

రంగనాథంగారు పెదివి విరిచారు. ఆయనకీ ఆలోచన ఏమీ నచ్చలేదు. ''గౌరవం చెయ్యవలసిన శవాన్ని ఇలా ఉపయోగించుకోడమా?''

''ఆ శవాన్ని ఏ విధంగా ఉపయోగించుకున్నా, దానికేం కష్టం తోచదుగా! కాదూ అంటే, ఇవి మన 'హృదయాలు', వాటికి సమాధానాలు చెప్పుకోవాలంటారూ, మరణించి కూడా గోపాలస్వామి, సేవ చేశాడనుకుందాం''అన్నాడు రామచంద్రన్. ''ఆలోచన మొదట తట్టినప్పుడు నాకే సిగ్గేసింది కానీ, ఈ నిస్సహాయ స్థితిలో ఈ అవకాశం చూస్తూ, చూస్తూ, వొదులుకోలేము. చూడండి, విశ్వామిత్రుడంతటివాడు కుక్క మాంసం తినవలసొచ్చింది.'' అన్నాడు చంద్రం.

రంగనాథంగారు జవాబు చెప్పకుండా ఊరుకున్నారు.

తెల్లవారగానే జైలరుతో తగాదా. శవాన్ని జైలు ఆవరణలోనే దహనం చేయించాలన్నాడుట సూపరింటెంటు. శవం బయటికి వెళ్ళితీరాలని పట్టు పట్టారు రంగనాథంగారు. బయట ఊరేగింపులూ, సభలూ ఏమీ జరగవని మాటిచ్చారు. రంగనాథంగారి మాటంటే చివరికిసూపరింటెంటుగారికి కూడా గురే. ఆయన మాటమీద శవాన్ని పురజనులందరికీ ఒప్పగించడానికి సూపరింటెంటు ఒప్పుకున్నాడు.

దేశసేవలో ప్రాణాలర్పించిన గోపాలస్వామి శవాన్ని 'ఇంక్విలాబ్, జిందాబాద్' నినాదాలతో జైలు నించి బయటికి పంపించారు. దానితో, నాలుగు నెలలనించీ ఇంటికి ఉత్తరం పంపలేక తహతహలాడుతున్న ఆరువందలమంది ఖైదీల ఉత్తరాలూ వెళ్ళాయి. ◘

